క్లుప్తంగా

మహిళాభ్యున్నతికి పాటుపడుతున్న ప్రభుత్వం



చిలకలూరిపేట: మహిళాభ్యున్నతికి ప్రభుత్వం పాటు పడుతున్నదని మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని చెప్పారు. పట్టణంలోని 22, 23, 24, 25, 26 వార్డులకు సంబంధించిన వైఎస్సార్ ఆసరా వేడుకలను శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న చైర్మన్ మాట్లాడుతూ సంబంధిత వార్డుల్లో రూ.1.50 కోట్లకు పైగా డ్వాక్రా మహిళలకు ప్రభుత్వం అందించిందని చెప్పారు. ఈ సందర్భంగా ఆయా వార్డుల్లో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి మహిళలు క్షీరాభిషేకం నిర్వహించి ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ముస్లిం సంచార జాతుల కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ దరియావలి, 24,25,26 వార్డుల కౌన్సిలర్లు షేక్ కరిముల్లా, తోట నాగలక్ష్మి, చెంబేటి భారతి, వార్డు ఇన్‌చార్జులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్బీకేలను సందర్శించిన వ్యవసాయ సలహామండలి చైర్మన్

చిలకలూరిపేటటౌన్: రైతులు తమ అవసరాలను తీర్చే రైతు భరోసా కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని పల్నాడు జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కె.సాయి మార్కొండారెడ్డి చెప్పారు. శుక్రవారం మండలంలోని కావూరు, గంగన్నపాలెం గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాలను జిల్లా వ్యవసాయ సలహామండలి సభ్యుడు నల్లూరి సాంబశివరావుతో కలసి సందర్శించారు. ఈ సందర్భంగా రైతుల మాట్లాడారు. రైతుల నుంచి వచ్చిన సూచనల మేరకు త్వరలో ప్లాంట్ డాక్టర్ కాన్సెప్ట్, అగ్రికల్చరల్ క్లినిక్‌లను ఏర్పాటు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి టి.శ్రీలత, ఏఈవో జీపీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విఘ్నేశ్వరస్వామి ఆలయ ధర్మకర్తగా అనూరాధ



నరసరావుపేట ఈస్ట్: మల్లమ్మసెంటర్ సమీపంలో దేవదాయశాఖ పరిధిలోని విఘ్నేశ్వరస్వామి ఆలయ వంశపారంపర్య ధర్మకర్తగా నాగసరపు అనూరాధ బాధ్యతలు స్వీకరించారు. ఆలయంలో శుక్రవారం దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ మంజూష ధర్మకర్త అనూరాధచే ప్రమాణ స్వీకారం చేయించారు. ఈసందర్భంగా అనూరాధ మాట్లాడుతూ, ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. గతంలో జరిగిన విధంగానే స్వామి వారికి పూజా కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. భక్తులు ఆలయ అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో శ్రీవాసవీ మిత్రమండలి అధ్యక్షుడు చేగు వెంకటేశ్వరరావు, అర్వపల్లి శ్రీనివాసరావు, కొత్త హనుమంతరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

బస్ షెల్టర్ నిర్మాణ పనులకు భూమి పూజ



శావల్యాపురం: మండలంలోని వేల్పూరు గ్రామానికి వెళ్లే రహదారి మార్గంలో ప్రధాన కూడలిలో బస్ షెల్టర్ ఏర్పాటు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు చేతులమీదగా భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గుంటూరు–కర్నూలు జాతీయ రహదారి మార్గం వెంబడి వేల్పూరు గ్రామస్తులకు ప్రయాణికులకు అనుకూలంగా ఉండే విధంగా నిర్మాణ పనులు పారదర్శకంగా చేపట్టాలన్నారు. ఎంపీపీ నిధులు రూ.4 లక్షల వ్యయంతో బస్‌షెల్టర్ నిర్మాణ పనులు చేపట్టినట్లు పంచాయతీ రాజ్ ఏఈ వెంకటేశ్వరస్వామి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అనిల్‌కుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు తూమాటి కబ్బారావు, చుండూరి వెంకటేశ్వర్లు,స్వర్ణాల వెంకట్రావు, రంతు శివ, సాదినేని చిన వెంకయ్య,ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య,తహసీల్దారు షేక్ జాన్‌సైదులు, వీఆర్వో వీరవల్లి నాగ సంతోషలక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు అళ్ళ యుగంధర్, కొమటినేని అశోక్‌చౌదరి పాల్గొన్నారు.

తాగునీటి సమస్య రానివ్వం

శావల్యాపురం: వేసవిలో ప్రజలు తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడకుండా ఉండేందుకు ముందస్తు చర్యలు చేపట్టినట్లు ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అనిల్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలం కేంద్రం శావల్యాపురం ఎస్టీ కాలనీలో చేతి పంపు ఏర్పాటు పనులకు భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సారథ్యంలో ఎంపీపీ నిధులతో ఒక్కో ఎంపీటీసీ సభ్యులు రూ. ఒక లక్ష 20 వేలు నిధులు కేటాయించగా మండలంలోని 11మంది ఎంపీటీసి సభ్యులకు మంజూరు చేశామన్నారు. ఈకార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చుండూరి వెంకటేశ్వర్లు, జవంగుల బాబు, కొణతం ఎరుకలరెడ్డి, మండల కోఆప్షన్ సభ్యులు దూదేకుల హుస్సేన్,చిట్టేటి రవి, పొట్టిపాటి శ్రీను, ఏసురాజు,ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య,ఏఈ మాధవత్ ఆకాష్ పాల్గొన్నారు.

అవగాహన లేకుండా మాట్లాడకండి

- కాల్వలు కట్టి, రోడ్లు వేసి రైతులు భూములు విక్రయించరు!
- భూములు సేకరించాక మౌలిక సదుపాయాలు ప్రభుత్వమే కల్పిస్తుంది
- వైఎస్సార్ జగనన్న కాలనీపై చర్చలో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని
- కౌన్సిల్‌లో టీడీపీ సభ్యుల గందరగోళం
- మైకు విరిచిన విపక్ష కౌన్సిలర్



మాట్లాడుతున్న వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు (ఇన్‌సెట్) ఆగ్రహం వ్యక్తం చేస్తున్న చైర్మన్ షేక్ రఫాని

చిలకలూరిపేట: కాల్వలు, కల్వర్టులు నిర్మించి, రోడ్లు వేసి రైతులు భూములు విక్రయించరని... రైతుల వద్ద నుంచి భూమి కొనుగోలు చేశాక మౌలిక సదుపాయాలు ప్రభుత్వమే కల్పిస్తుందని.. కనీసం ఈ విషయం పట్ల అవగాహన లేకుండా నోటికి వచ్చినట్లు టీడీపీ సభ్యులు మాట్లాడటం వారి అవివేకానికి నిదర్శనమని మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం మైలవరపు గుండయ్య కౌన్సిల్ హాలులో శుక్రవారం నిర్వహించారు.

సమావేశానికి చైర్మన్ షేక్ రఫాని అధ్యక్షత వహించారు. సమావేశంలో టీడీపీకి చెందిన కౌన్సిలర్ గంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ వైఎస్సార్ జగనన్న కాలనీలో అవినీతి జరిగిందని, రైతులకు అధిక ధరలు చెల్లించారని... రోడ్లు, కాల్వలు, కల్వర్టులు లేని పొలాలు కొనుగోలు చేశారని వితండవాదానికి దిగారు. దీనిపై మున్సిపల్ చైర్మన్ రఫాని స్పందిస్తూ ఎక్కడా రైతులు తమ భూములు అభివృద్ధి చేసి ఇవ్వరని, భూములు కొనుగోలు చేశాక సంబంధిత చర్యలను ప్రభుత్వం తీసుకుంటుందన్న ఇంగిత జ్ఞానం లేకుండా మాట్లాడవద్దని హెచ్చరించారు. అగ్రిగోల్డ్ భూముల కొనుగోలు, భారీ సీసీఐ కుంభకోణం వంటి అనేక అవినీతి పనులకు పాల్పడిన చరిత్ర టీడీపీ నాయకులు, ఆ పార్టీ పెద్దలకే ఉందని విమర్శించారు. ప్రతిపని పారదర్శకంగా నిర్వహిస్తున్న చరిత్ర తమ ప్రభుత్వానిదని వెల్లడించారు. అయినా వినకుండా పదేపదే ఆరోపణలు చేయడంతో మున్సిపల్ వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వర రావు, వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు బేరింగ్ మౌలాలి, వడితే కోట్యానాయక్ తదితరులు ప్రతివాదనకు దిగారు. ఈ దశలో సహనం కోల్పోయిన గంగా శ్రీనివాసరావు మైకును నేలకు విసిరి కొట్టి ధ్వంసం చేశారు. చైర్మన్ వేదిక వద్దకు దూసుకుపోయి వాగ్వాదానికి దిగారు. దీంతో ఆగ్రహించిన చైర్మన్ మీ అనుచిత ప్రవర్తనకు సమావేశం నుంచి ఎందుకు సస్పెండ్ చేయరాదంటూ ప్రశ్నించారు. కేటాయించిన సీటులోకి వెళ్లి కూర్చోవాలని హెచ్చరించారు.

అనధికార కుళాయిల పునరుద్ధరణపై..

ఎజెండాలోని 34వ అంశంకింద అనుమతి లేకుండా వేసుకున్న అనధికార కుళాయిల క్రమబద్ధీకరణపై చర్చ విషయంలోనూ టీడీపీ సభ్యుడు గంగా శ్రీనివాసరావు పలు ఆరోపణలకు దిగారు. ఈ విషయమై చైర్మన్ రఫాని మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటయ్యాక ఏర్పడిన సచివాలయ వ్యవస్థ కారణంగా నిఘా పెరిగి అనధికార కుళాయిల సంఖ్య తగ్గి పోయిందని వెల్లడించారు. ప్రస్తుతమున్న అనధికార కుళాయిలన్నీ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసినవేనని, ప్రస్తుతం వాటిని క్రమబద్ధీకరిస్తే పురపాలక సంఘానికి ఆదాయం పెరగడంతో పాటు నీటి చౌర్యాన్ని అరికట్టవచ్చని చెప్పారు. అయినా వినకుండా వాదనకు దిగడంతో మున్సిపల్ కమిషనర్ సీహెచ్ గోవిందరావు మాట్లాడుతూ పదేపదే మున్సిపల్ సిబ్బందిపై ఆరోపణలు చేయడం సరికాదని, మున్సిపల్ సిబ్బంది తప్పు చేసినట్లు ఫిర్యాదు చేస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఫిర్యాదులు రాకున్నా అనధికార కుళాయిలు ఉన్నట్లు గుర్తించి వాటిని క్రమబద్ధీకరించేందుకు ఎజెండాలో సంబంధిత విషయాన్ని పొందుపరిచామని చెప్పారు. క్రమబద్ధీకరణకు అభ్యంతరం ఉంటే, అనధికార కుళాయిలు తొలగిస్తామని సమాధానం చెప్పారు. సమావేశం సక్రమంగా సాగనీయకుండా టీడీపీ సభ్యులు గందరగోళం సృష్టిస్తున్న సమయంలో ఎజెండాను ఆమోదిస్తున్నట్లు తెలిపి చైర్మన్ సమావేశాన్ని ముగించారు.

బ్యాంక్ సేవలు ఎంతో అవసరం



సీజీజీబీ నూతన శాఖ ప్రారంభోత్సవం అనంతరం సభలో మాట్లాడుతున్న ఎంపీ

బొల్లాపల్లి: వెనుకబడిన మండలంలో గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల అభివృద్ధికి బ్యాంకు సేవలు అవసరమని ఎంపీ లావు శ్రీ కృష్ణ దేవరాయలు అన్నారు. శుక్రవారం మండలంలోని వెల్లటూరు గ్రామంలో చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు నూతన శాఖ ప్రారంభోత్సవం అనంతరం ఆ శాఖ నర్సరావుపేట ఆర్ఎమ్ బి.మారుతీరామ్ అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ మాట్లాడుతూ 70 వేల జనాభా ఉన్న మండలంలో కేవలం ఒకే ఒక్క బ్యాంకు తన శాఖను నిర్వహిస్తుందని, ప్రస్తుతం సీజీజీబీ తన సేవలను ఏర్పాటుకు శ్రీకారం చుట్టిందని, దీన్ని మండల ప్రజలు ఉపయోగించుకోవాలన్నారు. అనంతరం సీజీజీబీ చైర్మన్ టి.కామేశ్వరరావు మాట్లాడుతూ సీజీజీబీ ప్రస్తుతం 248వ శాఖను ఈ గ్రామంలో ఏర్పాటు చేశామన్నారు. పల్నాడు జిల్లాలోనే 65వ శాఖగా ఉందని గుర్తు చేశారు. 1983–84లో ఆంధ్రాబ్యాంక్‌కు అనుబంధంగా ఈ బ్యాంక్ ఏర్పాటైందని, 8 జిల్లాల్లో 28 లక్షలకు పైగా ఖాతాదారులు కలిగి ఉన్నారని తెలిపారు. డిజిటల్ బ్యాంకింగ్ ద్వారా సేవలు అధికంగా ఉంటాయన్నారు. విస్తృతస్థాయిలో సేవలు అందించడానికి సుశాంత్‌ను మేనేజర్‌గా అపాయింట్ చేయడమైందని తెలిపారు. ప్రధాన శాఖ కార్యాలయం అధికారి ఆంజనేయులు, సర్పంచ్ ఎం.చినవీరయ్య, మండల ఉపాధ్యక్షులు టి.కోటిరెడ్డి, ఎంపీటీసీ జి. చినవెంకయ్య, గ్రామపెద్దలు ఖజ్జాయం లక్ష్మీనారాయణ, అర్వపల్లి నరసింహారావు, అడక లింగరాజు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షలకు సర్వం సిద్ధం

బొల్లాపల్లి: కలెక్టర్ ఆదేశానుసారం 10వ తరగతి పబ్లిక పరీక్షలకు సర్వం సిద్ధం చేస్తున్నామని ఇన్‌చార్జి తహసీల్దారు వి.సుధాకర్ శర్మ శుక్రవారం తెలిపారు. ఏప్రిల్ 3న పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయని చెప్పారు. బి–గ్రేడ్ పరిధిలో మండల కేంద్రంలోని మోడల్ స్కూల్, జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఎగ్జామ్ సెంటర్‌ను కేటాయించామన్నారు. ఆయా సెంటర్ల పరిధిలో 490 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారని తెలిపారు. మండలంలో వెల్లటూరు, మేళ్లవాగు, గుమ్మనంపాడు, బొల్లాపల్లి జెడ్పీ హైస్కూల్స్, కేజీబీవీ, మోడల్ స్కూల్‌లో విద్యను అభ్యసించే విద్యార్థులకు మండల కేంద్రంలో సెంటర్ కేటాయించినట్లు తెలిపారు.

శావల్యాపురంలో...

శావల్యాపురం: 3 నుంచి 18వ తేదీ వరకు జరగనున్న పదో తరగతి పరీక్షల సజావుగా జరిగేలా చర్యలు తీసుకున్నామని తహసీల్దారు షేక్ జాన్ సైదులు అన్నారు. శుక్రవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు మాట్లాడుతూ జిల్లా కలెక్టరు ఆదేశాలు మేరకు మండల స్థాయిలో శావల్యాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల్లో జరగనున్న పదోతరగతి విద్యార్థులు 268 మంది పరీక్షలు రాస్తున్నట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాలను క్షేత్రస్థాయిలో సందర్శించి తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ తదితర వసతులను స్వయంగా పరిశీలించామన్నారు. ఉష్ణోగ్రత తీవ్రత ప్రభావం అధికంగా ఉన్నందున విద్యార్థులు తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. పరీక్షలు జరిగే సమయంలో పరీక్ష కేంద్రం సమీపంలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. ఆయనతో పాటు డిప్యూటీ తహసీల్దారు వేముల వెంకట నాగరాజు ఉన్నారు.

పది విద్యార్థులకు వీడ్కోలు

వినుకొండ(నూజెండ్ల): స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థినులకు వీడ్కోలు సభ శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో జఫ్రుల్లా ముఖ్యఅతిథి గా పాల్గొని మాట్లాడు తూ విద్యార్థులు బాగా చదువుకుని భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. పబ్లిక్ పరీక్షల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. అనంతరం విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో కౌన్సిలర్ రెడ్డి నాగపద్మ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.నాగలక్ష్మి, ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



మండల విద్యాశాఖ అధికారి కే.పి. బాబురెడ్డి

రొంపిచర్ల నుంచి 501 మంది...

రొంపిచర్ల: మండలంలో ఈ నెల 3 నుంచి 18 వరకు పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు మండల విద్యాశాఖ అధికారి కె.పి. బాబురెడ్డి శుక్రవారం తెలిపారు. మండలంలో వి.రెడ్డిపాలెం ఏపీ మోడల్ స్కూల్, వి.రెడ్డిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, రొంపిచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. మండలంలో మూడు పరీక్ష కేంద్రాల్లో మొత్తం 501 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు అవుతున్నారని అన్నారు. మండలంలో ఏపీ మోడల్ స్కూల్‌లో 160 మంది, వి.రెడ్డిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 140 మంది, రొంపిచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో 201 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు అవుతున్నారని అన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని అన్నారు. పరీక్షా కేంద్రాల్లోకి చీఫ్‌లకు, ఇన్విజిలేటర్‌లకు సెల్‌ఫోన్లు అనుమతించటం లేదని అన్నారు. పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరుగుతాయన్నారు. విద్యార్థులు ఉదయం 8.45 గంటలకే పరీక్షా కేంద్రాల వద్దకు రావాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులు అసౌకర్యానికి గురి కాకుండా మంచి నీటి, వైద్య సేవలు ఏర్పాటు చేస్తామన్నారు. అవసరమైతే 104, 108 సౌకర్యాలు అందుబాటులో ఉంటాయని అన్నారు. విద్యార్థులు మాస్ కాపియింగ్‌కు పాల్పడకుండా, మానసిక ఆందోళనలకు గురికాకుండా పరీక్షలు బాగా రాయాలని సూచించారు. మండలంలో జరిగే పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు విజయవంతం అయ్యేందుకు తల్లిదండ్రులు, విద్యార్థులు తమకు సహకరించాలని కోరారు.

చాగంటివారిపాలెంలో సామూహిక శ్రీమంతం



ఆర్బీకేలో సామూహిక శ్రీమంతంలో పాల్గొన్న సీడీపీఓ శ్రీలత, ఏసీడీపీఓ సంతోషికుమారి

చాగంటివారిపాలెం(ముప్పాళ్ళ): గర్భిణుకు, బాలింతలకు పౌష్టికాహారంలోపాన్ని అధిగమించేందుకు గాను ప్రభుత్వం అంగన్‌వాడీకేంద్రాలద్వారా పౌష్టికాహారాన్ని అందిస్తోందని ఐసీడీఎస్ సత్తెనపల్లి ప్రాజెక్ట్ సీడీపీఓ శ్రీలత చెప్పారు. మండలంలోని చాగంటివారిపాలెం ఆర్బీకేలోని సమావేశ మందిరంలో పోషణ్ పక్వాడలో భాగంగా మండలస్థాయి అవగాహన కార్యక్రమం శుక్రవారం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న సీడీపీఓ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రం ద్వారా గర్భిణుకు, బాలింతలకు ఆరు రకాల పౌష్టికాహారం అందిస్తున్నామన్నారు. వీటితో పాటుగా గుడ్లు, పాలు అందించడం జరుగుతుందన్నారు. చిరుధాన్యాలతో తయారు చేసే పోషకాహారం తయారీ పై అవగాహన కల్పించారు. పోషకాహారంతో తయారు చేసిన పిండివంటలను ప్రదర్శించి బాలింతలకు అందించారు. గర్భిణుకుసామూహిక శ్రీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ వైస్‌ఎంపీపీ ఎమ్‌జెఎమ్‌రామలింగారెడ్డి, సత్తెనపల్లి ఏసీడీపీఓ సంతోషికుమారి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఈఓపీఆర్డీ రూపవతి, సత్తెనపల్లి, రాజు పాలెం సూపర్‌వైజర్లు జీవనజ్యోతి, అనంతలక్ష్మి, రమాదేవి, ప్రసన్నరాణి, అంగన్‌వాడీకార్యకర్తలు పాల్గొన్నారు.

సీసీ డ్రైన్స్ నిర్మాణ పనులకు భూమి పూజ

శావల్యాపురం: మండలంలోని వయ్యకల్లు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం నిధులు మంజూరు చేయగా రూ.10 లక్షల వ్యయంతో సీసీ డ్రైన్స్ నిర్మాణ పనులకు భూమి పూజ కార్యక్రమం చేపట్టినట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ భీమని అంకారావు శుక్రవారం తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సారథ్యంలో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కావూరి మాబుసుభానయ్య, దారా లింగారావు, కొర్రపాటి రామాంజినేయులు, దారా మోష, కావూరి చిననారాయణ, పంచాయతీ కార్యదర్శి చింతా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

శావల్యాపురం: నేడు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం ఉదయం 11 గంటలకు ఎంపీపీ ముండ్లమూరి సుహాసినీ అనిల్‌కుమార్ అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య శుక్రవారం తెలిపారు. ఈసమావేశానికి ముఖ్య అతిథిగా స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు హాజరవుతారన్నారు.

నేడు వైఎస్సార్ ఆసరా 3వ విడత చెక్కుల పంపిణీ

ఈపూరు: వైఎస్సార్ ఆసరా 3వ విడత చెక్కుల పంపిణీ కార్యక్రమం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం జరుగుతుందని ఎంపీడీవో ఉషాకిరణ్ తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే బొల్లా ముఖ్య అతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు. మండలంలో 778 గ్రూపుల్లో 7780మంది సభ్యులకు 3వ విడత రూ.6.78 కోట్లు వారి ఖాతాలకు జమ కానున్నాయని ఆమె తెలిపారు. కనుక ప్రతిష్ఠాత్మకంగా జరుగుతున్న ఈ కార్యక్రమానికి డ్వాక్రా గ్రూపు సభ్యులతో పాటు ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు అందరూ పాల్గొనాలని ఆమె కోరారు.


నేడు విద్యుత్ సరఫరా నిలిపివేసే ప్రాంతాలు

చిలకలూరిపేటటౌన్: విద్యుత్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా శనివారం ఉదయం పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏడీఈ ఆర్ అశోక్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని మద్దినగర్, వేలూరు డొంక, రహమత్‌నగర్, దాసరి కాలనీ, చీరాలరోడ్డు, ప్రభుత్వాసుపత్రి రోడ్డు ప్రాంతాల్లో సంబంధిత వేళల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు ఈ మార్పును గమనించి సహకరించాలని కోరారు.

పిచ్చికుక్క దాడి: పలువురికి గాయాలు

శావల్యాపురం: మండలంలోని కారుమంచి గ్రామంలో రెండు రోజుల నుంచి పిచ్చి కుక్క స్వైర విహారం చేసిన ఘటనలో పలువురికు తీవ్ర గాయాలపాలైనారు. శుక్రవారం కాలనీకు చెందిన కొమ్మతోటి సుగుణమ్మ, బత్తుల సుశీల పిచ్చి కుక్క దాడి చేసి గాయపరిచింది. ఇరువురు స్థానిక ఆరోగ్య కేంద్రంలో వైద్య చికిత్స చేయించుకున్నారు. అలాగే ఎస్సీ కాలనీకు చెందిన కృపాభిషేక్ (16 నెలల) బాబు ఇంటి ఆవరణంలో ఆడుకుంటున్న నేపథ్యంలో పిచ్చి కుక్క దాడికి పాల్పడినట్లు గ్రామస్తులు తెలిపారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా చాగంటి



సభ్యులను అభినందిస్తున్న న్యాయవాదులు

వినుకొండ(నూజెండ్ల): వినుకొండ బార్ అసోసియేషన్ ఎన్నికలు శుక్రవారం ఉత్కంఠభరితంగా జరిగాయి. ఈ ఎన్నికల్లో మొత్తం 94 ఓట్లు ఉండగా 89 ఓట్లు పోలయ్యాయి. అధ్యక్ష పదవికి సీహెచ్ వీరాంజనేయ చౌదరి, మీసాల శ్రీనివాసరావు, గౌస్ మొహియుద్దీన్ ఖాన్‌లు పోటీ చేశారు. అయితే చాగంటి వీరాంజనేయ చౌదరికి 44 ఓట్లు రాగా, మీసాల శ్రీనివాస రావుకు 28 ఓట్లు వచ్చాయి. గౌస్ మొహియుద్దీన్ ఖాన్‌కు 16 ఓట్లు వచ్చాయి. మరొక ఓటు నోటా క్రింద నమోదైంది. మొత్తం మీద 16 ఓట్ల మెజారిటీతో చాగంటి గెలుపొందారు. అలాగే ఉపాధ్యక్షులుగా మారెళ్ల సీతా రామాంజనేయులు, కార్యదర్శిగా కె. హనుమంతురావు, కార్యదర్శి పి.వి రమణారెడ్డి విజయం సాధించారు. అలాగే ట్రెజరర్‌గా కాకాని నాగేశ్వరరావు ఎన్నికయ్యారు. గెలుపొందిన వారిని న్యాయవాదులు ఘనంగా సత్కరించారు. ఎన్నికల అధికారులుగా దూళ్ల నాగరాజు, గాలినాగరాజు, యనమదల శ్రీనివాసారావులు వ్యవహరించారు. గెలుపొందిన వారిని ఏజీపీ ఎం.ఎన్ ప్రసాదు, ఎలీషాబాబు, వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు అభినందించారు.

డ్వాక్రా మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

- ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు
- నూజెండ్లలో వైఎస్సార్ ఆసరా పథకం సంబరాలు
- 874 గ్రూపులకు రూ.5.38 కోట్లు జమ



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ(నూజెండ్ల): ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని డ్వాక్రా మహిళలకు అందజేస్తున్న పథకాలను సద్వినియోగించుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. మండల కేంద్రమైన నూజెండ్లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వైఎస్సార్ ఆసరా మూడో విడత సంబరాలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ మండల పరిధిలోని 874 గ్రూపులకు గాను రూ.5.38 కోట్లు జమ అయ్యాయని తెలిపారు. మన ప్రాంత మహిళల తరఫున ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. పేద ప్రజల కోసం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి వారి అభ్యున్నతికి దోహదపడుతుందన్నారు. ఇళ్లు లేని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేసి మహిళల పేరుపై పట్టాలు మంజూరు చేసినట్లు వివరించారు. అమ్మఒడి, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా వంటి అనేక సంక్షేమ పథకాలు మహిళల అభ్యున్నతి కోసం ప్రవేశపెట్టినట్లు తెలిపారు. రాజకీయంగా, సామాజికంగా, ఉద్యోగాల్లో తదితర రంగాల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించినట్లు చెప్పారు. మహిళలు డ్వాక్రా రుణాల ద్వారా, ప్రభుత్వం సాయం కింద వచ్చే నగదును సద్వినియోగం చేసుకోవాలన్నారు. మన ప్రభుత్వ హయాంలో నూజెండ్ల మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామన్నారు. రాష్ట్రంలోనే వినుకొండను మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దు తానని చెప్పారు.

కార్యక్రమంలో ఎంపీపీ మేడం జయరామిరెడ్డి, జెడ్పీటీసీ జడ్డా సుబ్బులు రామయ్య, మార్కెట్ యార్డు చైర్మన్ బత్తుల వెంకటేశ్వర్లుయాదవ్, వైస్ చైర్మన్ కొమిరిశెట్టి రామారావు, సొసైటీ పర్సన్ ఇన్‌చార్జిలు పారా వెంకటేశ్వర్లు, పొట్లపల్లి పిచ్చిరెడ్డి, మండల కన్వీనర్ నక్కా నాగిరెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ గంధం బాలిరెడ్డి, పార్టీ నాయకులు ఒంగూరి ప్రసాద్, ఎంపీడీవో జిలానీ బాషా, ఏపీఎం సత్యానందం పాల్గొన్నారు.

35 అంశాలకు కౌన్సిల్ ఆమోదం

- 38 అంశాలతో వినుకొండ కౌన్సిల్ అజెండా
- వివిధ అంశాలపై సమగ్ర చర్చ



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ డాక్టర్ దస్తగిరి

వినుకొండ(నూజెండ్ల): స్థానిక మున్సిపల్ సమావేశ మందిరంలో పురపాలక సంఘం సాధారణ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశంలో 38 అంశాలతో కూడిన అజెండాను మున్సిపల్ చైర్మన్ డాక్టర్ దస్తగిరి కౌన్సిల్ ముందు ప్రవేశపెట్టారు. ఇందులో 2,3,4 అంశాల్లో ఆశీలు వసూలు చేసుకునేందుకు వేలం పాటలో కేవలం ఇద్దరు మాత్రమే హాజరు కావడంతో పునఃపరిశీలించాల్సిందిగా కమిషనర్ శ్రీనివాసులుకు తెలిపారు. మిగిలిన 35 అంశాలను కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. పట్టణంలోని పలు వార్డుల్లో వీధిలైట్ల సమస్య, 1,2 వార్డుల్లో విద్యుత్ లైన్‌మెన్ విధుల్లో లేరని సమస్యలను సభ ముందుకు తీసుకొచ్చారు. దీనికి స్పందించిన చైర్మన్ వెంటనే సమస్యలను పరిష్కరించాలని డీఈ వెంకయ్యకు సూచించారు. అలాగే రంజాన్ మాసం కావడం వల్ల పట్టణంలోని మసీదుల వద్ద పారిశుధ్య చర్యలతో పాటు వసతి సౌకర్యాలు ఏర్పాటు చేయాలని 19వ వార్డు కౌన్సిలర్ ఎంఎస్‌కే బాషా సమస్యను సభ దృష్టికి తీసుకురాగా వెంటనే సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం జరిగిన అత్యవసర సమావేశంలో వినుకొండ పట్టణంలోని నరసరావుపేట రోడ్డులో ఎస్ఎస్‌పీ స్థలం పురపాలక సంఘానికి కేటాయించడం వల్ల ఆ స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేసేందుకు హక్కులు సంక్రమించిన నేపథ్యంలో గతంలో ఎస్ఎస్‌పీ స్థలంలో ఉన్న ఇళ్లను తొలగించిన నేపథ్యంలో వారు బకాయిలు పడిన ఇంటి పన్నులను రద్దు చేస్తున్నట్లు కౌన్సిల్ ఏకగ్రీవంగా తీర్మానించింది. మొత్తం 64 ఇళ్లకు సంబంధించి రూ.54,11,632లను రద్దు చేస్తున్నట్లు కౌన్సిల్ తీర్మానించింది. కార్యక్రమంలో కౌన్సిల్ సభ్యులు, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దారు కార్యాలయంలో ఘర్షణ

పొలం అమ్మలేదని ఒకరు, కొన్నామని మరొకరు వివాదం



తహసీల్దారు కార్యాలయంలో ఘర్షణ పడుతున్న తండావాసులు, నరసరావుపేట వాసులు

ఈపూరు: తమ పొలం అమ్మక పోయినా అమ్మారని నరసరావుపేటకు చెందిన కొందరు వ్యక్తులు వచ్చి రీసర్వేలో పేర్లు ఎక్కించుకునేందుకు ప్రయత్నం చేస్తుండగా వారిపై ఘర్షణకు దిగిన సంఘటన మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయంలో శుక్రవారం జరిగింది. ఈపూరు మండలం బొమ్మరాజుపల్లి తండా 14/2లో ఉన్న 3 ఎకరాల 66 సెంట్ల భూమిని భూక్యా హర్జానాయక్ నరసరావుపేటకు చెందిన రంగరాజుకు 2008 సంవత్సరంలో పొలం అమ్మాడని, రంగరాజు 2019లో అదే గ్రామానికి చెందిన శ్రీనివాసరావుకు అమ్మాడని, ఇప్పుడు శ్రీనివాసరావు అనే వ్యక్తి మరికొందరితో వచ్చి రీసర్వేలో పేర్లు ఎక్కించుకునేందుకు తహసీల్దారు వెంకటేశ్వర్లు నాయక్‌తో మాట్లాడుతుండగా హర్జానాయక్ కుమారులైన నాగేశ్వరరావునాయక్, కృష్ణానాయక్‌లు వచ్చి తమ తండ్రి పొలం అమ్మలేదని, అక్రమంగా తమ పొలాన్ని రీసర్వేలో పేర్లు మార్చేందుకు ప్రయత్నిస్తున్నారని, ఇందుకు అధికారులు కూడా సహకరిస్తున్నారంటూ శ్రీనివాసరావుపై వాగ్వివాదానికి దిగి ఘర్షణకు దిగారు. తమది పూర్వీకుల ఆస్తి అని కుమారులైన మాకు తెలియకుండా తండ్రి పొలం ఎలా అమ్ముతాడని, వారు ఆక్రమించుకోవడానికి ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. దీంతో శ్రీనివాసరావు తమకు అమ్మిన వారి దగ్గరే తేల్చుకుంటామని అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఎస్ఐ వెంకట్రావు సిబ్బందితో వచ్చి అక్కడి నుంచి ఇరువురిని పంపించి వేశారు.

ప్రజాసంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వ పాలన

- ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు
- వినుకొండలోని 20 వవార్డులో గడప గడపకూ మనప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే బొల్లా



పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ(నూజెండ్ల): అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తున్నట్లు ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పేర్కొన్నారు. పట్టణంలోని 20వ వార్డు పరిధిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పాల్గొని ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం నవరత్నాల ద్వారా అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలతో పాటు అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాసంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలన అందిస్తున్నారన్నారు. వినుకొండ పట్టణాన్ని తమదైన శైలిలో అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని చెప్పారు. ఇప్పటికే పట్టణ తాగునీటి సమస్యను పరిష్కారం చేశామని, రానున్న రోజుల్లో రెండుపూటల తాగునీరు అందించేందుకు చర్యలు చేపట్టినట్లు చెప్పారు. అలాగే గత పదేళ్లల్లో వినుకొండ ఎలా ఉంది, ఇప్పుడు ఎలా ఉందనే విషయాన్ని ప్రజలే గుర్తించాలని అన్నారు. పట్టణంలో తాగునీటి సమస్య పరిష్కారంతో పాటు ఎస్ఎస్‌పీ కాలనీలో షాపింగ్‌కాంప్లెక్స్‌లు, రైతు బజారు, ప్రభుత్వ బాలికలకు అదనపు తరగతి గదులు, ముస్లిం మైనార్టీ కాలేజీ, షాదీఖానా, పట్టణంలోని ఎస్ఎస్‌పీ కాలువ అభివృద్ధి, వినుకొండ ఘాట్‌రోడ్డు నిర్మాణం, గిరిప్రదక్షిణం రోడ్డు, మున్సిపల్ స్టేడియం, రైల్వే అండర్ బ్రిడ్జితో పాటు ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టినట్లు చెప్పారు. ఇల్లు లేని నిరుపేదల కోసం 5400 ఇళ్లను జగనన్న కాలనీలో నిర్మిస్తున్నట్లు చెప్పారు. గత పదేళ్లల్లో టీడీపీ హయాంలో జరగని అభివృద్ధి కరోనా కష్టకాలం ఎదురైనప్పటికీ వైసీపీ హయాంలో వినుకొండను అభివృద్ధి చేశామని చెప్పారు. గతంలో ఏ ప్రభుత్వం చేయలేని విధంగా అధికారులతో కలిసి గడపగడపకు తిరిగి ప్రజాసమస్యలు తెలుసుకొని వెంటనే పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో 20వ వార్డు నంది అంజనీదేవి, మార్కెట్‌యార్డు చైర్మన్ బత్తుల వెంకటేశ్వర్లుయాదవ్, వార్డుకౌన్సిలర్లు పాప సాని బ్రహ్మయ్య, ఎం.ఎ స్‌కే. బాషా, షకీలా దస్తగిరి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.